సాక్షి
విజయనగరం
సోమవారం, 11, సెప్టెంబర్, 2023



వర్షాతిరేకం
ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు సాగులో ఉన్న పంటలకు ప్రాణం పోస్తున్నాయి.
- 8లో



రక్షణ 'దిశ'గా..!
ఆపదలో చిక్కుకున్న మహిళలు సాయం కోరిన వెంటనే పోలీసులు చేరుకుని రక్షణ కల్పించే వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించింది.
- 8లో



ఆధునిక బస్టాప్
విజయనగరం కార్పొరేషన్ పరిధిలో రాజీవ్‌గాంధీ సర్కిల్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ సిద్ధమైంది.
- 8లో

న్యూస్‌రీల్

108లో ప్రసవం
- కవలలకు జన్మనిచ్చిన మహిళ


లక్ష్మికి పుట్టిన కవల పిల్లలతో కుటుంబ సభ్యులు

విజయనగరం ఫోర్ట్: 108 అంబులెన్సులో ఓ మహిళ పండంటి ఇద్దరు మగ బిడ్డలకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళ్తే... విజయనగరం మండలం గుంకలాం గ్రామానికి చెందిన పీత లక్ష్మికి ఆదివారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్సుకు కుటుంబ సభ్యులు ఫోన్ చేసారు. సమాచారం అందుకున్న వెంటనే 108 సిబ్బంది గ్రామానికి చేరుకుని మహిళను ఆస్పత్రికి తరలిస్తుండగా పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో విజయనగరానికి సమీపంలో 108 అంబులెన్సులో ప్రసవం జరిపించారు. ఆమెకు ఇద్దరు మగ బిడ్డలు జన్మించారు. మెరుగైన చికిత్స కోసం తల్లీపిల్లలను ఘోషాస్పత్రిలో చేర్పించారు. లక్ష్మికి 108 సిబ్బంది శివునాయుడు, సతీష్‌కుమార్‌లు ప్రసవం జరిపించారు.

ఎన్‌సీబీసీ సమావేశానికి ఎంపీ బెల్లానకు ఆహ్వానం
- 13న ఢిల్లీలో సమావేశం


ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ఉపకులాలను జాతీయ ఓబీసీ కమిషన్‌లో చేర్చే అంశంపై చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్(ఎన్‌సీబీసీ) నిర్వహించే సమావేశానికి విజయనగరం పార్లమెంటు సభ్యుడు బెల్లాన చంద్రశేఖర్‌కు ఆహ్వానం అందింది. ఈ నెల 13న ఉదయం 10 గంటలకు న్యూఢిల్లీలోని కస్తూర్బా గాంధీ మార్గ్‌లో ఉన్న న్యూ మహారాష్ట్ర సదన్‌లో ఈ సమావేశం జరగనుంది. ఆ సమావేశానికి ఓబీసీ జాతీయ కమిషన్ చైర్మన్ రాజేష్‌వర్మ నుంచి జాతీయ ఓబీసీ కమిషన్ సభ్యునిగా ఉన్న విజయనగరం పార్లమెంటు సభ్యుడు బెల్లాన చంద్రశేఖర్‌ను ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్‌లో సామాజికంగా, ఆర్థికంగా ఎంతో వెనుకపడి ఉన్న తూర్పుకాపు, శిష్టకరణ, కళింగ కోమటి/ వైశ్య, సొండి/సుండి కులస్తులను జాతీయ ఓబీసీ జాబితాలో చేర్చాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా ఇప్పటికే ఓబీసీ కమిషన్ చైర్మన్‌తో బాటు కేంద్ర మంత్రులను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పలుమార్లు కలిసి విజ్ఞప్తి చేసారు. ఈనెల 13న జరగనున్న సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి వివరాలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కార్యదర్శులు కూడా పాల్గొనున్నారు.

ఈనాడువి తప్పుడు రాతలు : ఎమ్మెల్యే

మెంటాడ(గజపతినగరం రూరల్): మండలంలోని జిన్నాం గ్రామానికి చెందిన ఇజ్జురోతు పైడితల్లి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందితే చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక గుండె ఆగి చనిపోయాడని ఈనాడులో తప్పుడు రాతలు రాయడం సరికాదని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన ఆదివారం మాట్లాడారు. మృతుడు పైడితల్లి ఏ పార్టీకి చెందిన వ్యక్తి కాదని వెల్లడించారు. వాస్తవాలు ఇలా ఉంటే టీడీపీ ధర్నాకు బయలుదేరుతూ పైడితల్లి ప్రాణం విడిచాడని రాయడం ఎంతవరకు సమంజసమన్నారు. ముందు రోజు వరకు చికిత్స పొందిన వ్యక్తి ధర్నాలకు, నిరసనలకు ఎలా హాజరవగలడని ప్రశ్నించారు. పచ్చమీడియా ఇలాంటి తప్పుడు రాతలు రాసి ప్రజలను తప్పుదోవ పట్టించడం ఎంతవరకు సమంజసమని ఎమ్మెల్యే ప్రశ్నించారు.

వైభవంగా సీతారాముల కల్యాణం


సీతారాములకు అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చాణక్య, శ్రీహర్షల ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ సీతారాములకు స్నపనం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అంగరంగ వైభవంగా కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవంలో ఎన్‌సీఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, హిమబిందు, నాగమణి, భక్తులు పాల్గొన్నారు.

వైద్య విద్యా భాగ్యం

జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వైద్య విద్యా భాగ్యం పేద, మధ్య తరగతి విద్యార్థులకు చేరువైంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేయడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

- జిల్లాలో వైద్య కళాశాలను అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం
- వైద్య కళాశాలలో 150 ఎంబీబీఎస్ సీట్లు
- అడ్మిషన్లు తీసుకున్న 115 మంది విద్యార్థులు
- కార్పొరేట్ కంటే మిన్నగా వసతులు కల్పించిన ప్రభుత్వం
- వసతులు అద్భుతంగా ఉన్నాయంటున్న విద్యార్థులు



ప్రభుత్వ వైద్య కళాశాల



విద్యార్థుల హాస్టల్ భవనం

విజయనగరం ఫోర్ట్:

వైద్య రంగంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విప్లవాత్మక మార్పులను చేపట్టింది. నాడు - నేడు ద్వారా ఆస్పత్రులను కార్పొరేట్ ఆస్పత్రులను తలదన్నేలా మార్చేసింది. ఆహ్లాదకర వాతావరణంలో ప్రభుత్వ ఆస్పత్రులను తీర్చిదిద్దింది. ఆస్పత్రుల అభివృద్ధికి ఎంత ప్రాధాన్యతను ఇస్తోందో వైద్య వైద్యను అభ్యసించాలన్న విద్యార్థులకు అదే తరహాలో అవకాశం కల్పించింది. ఎంబీబీఎస్ చదవాలంటే డబున్న వాళ్లకే సాధ్యం అనే భావన ఉండేది. దాన్ని తొలిగించి పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారు కూడా వైద్య విద్యను చదువుకునే అవకాశాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కల్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా 17 వైద్య కళాశాలలను నిర్మించతలపెట్టింది. అందులో ఈ ఏడాది ఐదు వైద్య కళాశాలలను అందుబాటులోకి ప్రభుత్వం తెచ్చింది. అందులో విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల ఒకటి. రాష్ట్ర వ్యాప్తంగా 750 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి రాగా మన జిల్లాకు సంబంధించి 150 సీట్లు అందుబాటులోకి వచ్చాయి.

వైద్య విద్యను అభ్యసించే అవకాశం

గతంలో ప్రైవేటు వైద్య కళాశాలలు అధికంగా ఉండడం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు వైద్య విద్యను చదువుకోలేకపోయేవారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు తక్కువగా ఉండడం వల్ల సీటు చాలా తక్కువ మందికి వచ్చేది. దీంతో ప్రైవేటు వైద్య కళాశాలలో చదివే స్థోమత లేక చాలా మంది ప్రత్యామ్నాయ విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి. ప్రస్తుత ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలలను అధికంగా అందుబాటులోకి తేవడం వల్ల ఎక్కువ మందికి వైద్య విద్యను అభ్యసించే అవకాశం వచ్చింది. అంతేకాకుండా దగ్గరలోనే ప్రభుత్వ వైద్య కళాశాలలు అందుబాటులోకి రావడం వైద్య విద్యను అభ్యసించే వారికి ఎంతగానో ఉపయోగకరం.

115 మందికి ప్రవేశాలు

ప్రభుత్వ వైద్య కళాశాలలో 150 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ఇందులో మొదట విడత కౌన్సెలింగ్‌లో 115 మంది అడ్మిషన్లు తీసుకున్నారు. రెండో విడత కౌన్సెలింగ్‌లో మిగతా వారు కూడా అడ్మిషన్లు తీసుకునే అవకాశం ఉంది.

కార్పొరేట్ కంటే మిన్నగా...

కార్పొరేట్ మెడికల్ కళాశాలల కంటే మిన్నగా ప్రభుత్వ వైద్య కళాశాలలో వసతులు కల్పించారు. ఈ విషయాన్ని వైద్య కళాశాలలో చేరిన వైద్య విద్యార్థులు, ప్రొఫెసర్లు చెబుతున్నారు. ఒక ప్రభుత్వ వైద్య కళాశాలలో ఇటువంటి సౌకర్యాలు ఉంటాయని ఊహించలేదని విద్యార్థులు సంతోషపడుతున్నారు. మొదటి ఏడాది వైద్య విద్యార్థుల కోసం నిర్మించిన హిస్టలాజీ, బయో కెమిస్ట్రీ, అనాటమీ, ఫిజియాలజీ ల్యాబ్‌లు, అందులో వసతులు అద్భుతంగా ఉన్నాయని, లెక్చరల్ గ్యాలరీ, విద్యార్థుల హాస్టల్ చాలా బాగున్నాయని చెబుతున్నారు.

సీటు రావడం గర్వంగా ఉంది



మాది విశాఖపట్నం. ప్రభుత్వం వైద్య కళాశాలలను నూతనంగా ఏర్పాటు చేయడం వల్ల ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు వచ్చింది. వైద్య కళాశాలలో సీటు రావడం గర్వంగా ఉంది. ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటు కాకపోతే మాలాంటి వారికి ప్రైవేటు వైద్య కళాశాలలో సీట్లు వచ్చేవి కావు. ప్రైవేటు వైద్య కళాశాలలో చదవడం చాలా కష్టతరం అయ్యేది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దయ వల్ల నాకు ప్రభుత్వ వైద్య కళాశాలలోనే సీటు వచ్చింది.

– భోజ ప్రసూన, వైద్య విద్యార్థి, ప్రభుత్వ వైద్య కళాశాల

సంతోషంగా ఉంది



మాది శ్రీకాకుళం. ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు రావడం చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వం కొత్తగా ఐదు కళాశాలలను అందుబాటులోకి తీసుకురావడం వల్ల ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య పెరిగింది. దీనివల్ల చాలా మందికి ప్రభుత్వ వైద్య కళాశాలలో సీట్లు వచ్చాయి. ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించింది. కార్పొరేట్ ఆస్పత్రుల కంటే మిన్నగా ఇక్కడ వసతులను ప్రభుత్వం సమకూర్చింది. ఫ్యాకల్టీ చాలా బాగుంది. పక్క జిల్లాలో సీటు రావడం మరింత ఆనందంగా ఉంది. తల్లిదండ్రులు తమ పిల్లలను దగ్గరగా ఉండి చదివించుకోవాలని అనుకుంటారు. దానికి అనుగుణంగానే నాకు సీటు వచ్చింది.

– బదగాల మనస్విని, వైద్య విద్యార్థి, ప్రభుత్వ వైద్య కళాశాల

కళాశాల చాలా బాగుంది



ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణంలో ప్రభుత్వం నాణ్యతలో రాజీ లేకుండా నిర్మాణాలు చేపడుతుంది. వైద్య విద్యార్థులు చదువుకోవడానికి అవసరమైన అన్ని వసతులు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విద్యార్థులు కూడా ఇక్కడ చదువుకోవడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

–డాక్టర్ కె.పద్మలీల, ప్రిన్సిపాల్, ప్రభుత్వ వైద్య కళాశాల

వసతులు అద్భుతం



మాది కృష్ణా జిల్లా ఉయ్యూరు. కొత్త కాలేజీ ఏ విధంగా ఉంటుందో అని మా తల్లిదండ్రులు భయపడ్డారు. కాని విజయనగరంలో చేరడానికి వచ్చి చూస్తే నాతో పాటు మా తల్లిదండ్రులు ఆశ్చర్యానికి గురయ్యారు. కొత్త వైద్య కళాశాలలో వసతులు ఇంత అద్భుతంగా ఉంటాయని ఊహించలేదు. ఎంతో అనుభవం గల ప్రొఫెసర్లు ఉన్నారు. తోటి విద్యార్థులతో స్నేహపూర్వక వాతావరణం ఉంది. డబ్బు ఉన్న వాళ్లే వైద్య విద్యను చదువుకోగలరనే భావన ఉండేది. కాని సీఎం జగన్ పేద వాళ్లకు కూడా వైద్య విద్యను చదువుకునే అవకాశాన్ని కల్పించారు.

– దానీ విక్టర్ పాల్, వైద్య విద్యార్థి, ప్రభుత్వ వైద్య కళాశాల


హిస్టలాజీ ల్యాబ్

జయితి కొండపై పులి


మెంటాడ : పులి కాలి గుర్తులను గుర్తించిన అటవీ శాఖ అధికారులు

మెంటాడ : మండలంలోని జయితి గ్రామంలో పులి సంచరించడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. శనివారం అర్ధరాత్రి గ్రామ సమీపంలోని కొండపైకి ఆవు దూడను తీసుకుని వెళ్లి చంపేయడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం తెల్లవారుజామున స్థానిక రైతు నీలాతి శంకరరావు కళ్లంలోని లేగ దూడ లేకపోవడంతో పరిసరాల్లో వెతకడం ప్రారంభించాడు. కళ్లానికి సమీపంలోని కొండకు దగ్గర్లో దూడ చనిపోయి పీలికలుగా ఉండటంతో గ్రామస్తులకు తెలిపాడు. దూడను చంపింది పులి అయి ఉంటుందని గ్రహించిన గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ శాఖాధికారులు రంగంలోకి దిగి పులి పనేనని స్పష్టం చేశారు. పులి అడుగులను అది సంచరించే ప్రాంతాన్ని వారు గుర్తించే పనిలో పడ్డారు. గ్రామంలో దండోరా వేయించి ఇళ్ల నుండి బయటకు ఎవరూ రావద్దని, పులి ఈ రోజుకు కొండపైనే ఉండే అవకాశం ఉంటుందని తెలిపారు. పులి సంచారంపై స్థానిక తహసీల్దార్‌కు, అటు పోలీసులకు సమాచారం అందించామని తెలిపారు.

తస్మాత్...

దత్తిరాజేరు: మండలంలోని పాచలవలస సవక పొలంలో ఆదివారం తెల్లవారుజామున పులి సంచరించిందన్న గ్రామస్తుల సమాచారం మేరకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రీనివాస్ పరిశీలించారు. వరి పొలం వద్దకు వెళ్లి అడుగులను పరిశీలించి పులి పాద ముద్రికలేనని నిర్ధారించారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

నేడు సచివాలయం, ఆర్‌బీకే ప్రారంభోత్సవం

తెర్లాం: మండలంలోని పణుకువలసలో నిర్మించిన గ్రామ సచివాలయ, రైతుభరోసా కేంద్ర భవనాలను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సోమవారం మధ్యాహ్నం ప్రారంభించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, సర్పంచ్ చందక సత్యనారాయణ ఆదివారం తెలిపారు. వీటితో పాటు హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనం, సోమిదవలస జంక్షన్ నుంచి నిర్మించిన బీటీ రోడ్డు, రక్షిత మంచినీటి పథకాలను కూడా ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు.

సెక్షన్ 30 అమలు


పోలీస్ సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ రూరల్: శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూసేందుకు పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో సెక్షన్ – 30 అమలు చేస్తున్నట్లు పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు స్పష్టం చేసారు. స్థానిక వైఎస్సార్ కూడలి, యాలం కూడలితో పాటు జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో తన సిబ్బందితో కలసి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా శాఖ పరమైన ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేస్తున్నామన్నారు. ఎటువంటి ర్యాలీలు, నిరసనలు, ధర్నాలు, బంద్‌లు నిర్వహించాలంటే కచ్చితంగా సబ్‌డివిజన్ పోలీస్ అధికారి ద్వారా ముందస్తు అనుమతులు ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలకు బాధ్యులు కావాల్సి ఉంటుందన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ బి.శివప్రసాద్, ఏఎస్‌ఐలు, హెచ్‌సీ తదితరులున్నారు.

తాత్కాలిక భవనానికి జిల్లా కోర్టు..
తరలింపు ప్రక్రియ ప్రారంభం


కోర్టు కాంప్లెక్స్ తాత్కాలిక భవనం

సాక్షి ప్రతినిధి, విజయనగరం: జిల్లా కోర్టు భవన సముదాయాన్ని పూల్‌బాగ్‌లో ఉన్న తాత్కాలిక భవనానికి తరలింపు ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కళ్యాణ్ చక్రవర్తి దంపతులు ఈ భవనంలో హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితులు జిల్లా జడ్జి దంపతులకు తీర్థ ప్రసాదాలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ నెల 26 నుంచి పూర్తి స్థాయిలో తరలింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. అక్టోబర్ మొదటి వారంలో కోర్టు కార్యకలాపాలు నిర్వహించేందుకు సన్నాహాలు జరగనున్నాయి. ప్రస్తుత వి.టి.అగ్రహారంలో ఉన్న కోర్టు కాంప్లెక్స్ శిథిలావస్థకు చేరుకుంది. కోర్టు కార్యకలాపాల నిర్వహణకు అనువుగా లేకపోవడంతో సంబంధిత అధికారులు నివేదిక ఇవ్వడం జరిగింది. ఈ నేపథ్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కళ్యాణచక్రవర్తి, న్యాయవాదుల సంఘ ప్రతినిధులు హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తాత్కాలిక భవనానికి తరలించేందుకు అనుమతి లభించింది. ప్రస్తుత భవనం పూర్తిగా తొలగించి ఆ స్థానంలో జీ ప్లస్ 6 కాంప్లెక్స్ నిర్మాణానికి హైకోర్టు అనుమతిని మంజూరు చేసింది. దీని నిర్మాణానికి రూ.99కోట్ల అంచనా వ్యయం వేశారు.


నూతన కోర్టు కాంప్లెక్స్ వద్ద పూజ కార్యక్రమాలు చేస్తున్న జిల్లా జడ్జి దంపతులు

ప్రజారోగ్యానికి రక్ష


పార్వతీపురం మండలంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్

జిల్లాలో ఇలా...	
మండలాలు	15
సచివాలయాలు	350
పీహెచ్‌సీలు	37
విలేజ్ హెల్త్ క్లినిక్‌లు	283
ఎంఎల్‌హెచ్‌పీలు	282
ఏఎన్‌ఎంలు	360
జిల్లా జనాభా	9,25,340

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్న విషయం విదితమే. గ్రామీణ ప్రాంత ప్రజలకు పల్లెల్లో మెరుగైన సేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వైద్య సేవలను అందిస్తున్నారు. ప్రతీ పీహెచ్‌సీలో పూర్తి స్థాయిలో వైద్యులను అందుబాటులో ఉంచేందుకు సిబ్బందిని రేషనలైజేషన్ చేసింది. మండల కేంద్రాల్లో సాంకేతికతతో కూడిన ఆస్పత్రులను నిర్మించి వైద్యులను అందుబాటులో తీసుకువచ్చింది. 108 వాహనాలను పూర్తి స్థాయిలో సమకూర్చడమే కాకుండా సమాచారం ఇచ్చిన క్షణాల్లో అత్యాధునిక వైద్యం లభించే ఆస్పత్రులకు రోగులు చేరేలా వసతులు సమకూర్చింది.

- జిల్లాలో ఈ నెల 15 నుండి జగనన్న ఆరోగ్య సురక్ష
- ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా వినూత్న కార్యక్రమం
- ఇంటింటికి ఏఎన్‌ఎంలు, వలంటీర్లు
- 30 నుంచి ప్రతీ మండలంలో వైద్య శిబిరాలు
- జిల్లాలో 282 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు
- జిల్లా జనాభా 9,25,340

పార్వతీపురం టౌన్: వైద్య వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడంలో దేశం మొత్తం రాష్ట్రం వైపు చూసేలా జగనన్న ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే జగనన్న ఆరోగ్య సురక్ష అనే మరో మంచి కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గ్రామాలు, పట్టణాల్లోని ఇళ్ల వద్దకే వెళ్లి జబ్బులున్న వారిని గుర్తించి, మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైఎస్ జగన్ ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' తీసుకొస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా ఈ నెల 15న కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా ఇంటింటికీ వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు వెళ్లనున్నారు. ఆరోగ్య సమస్యలను ఆరా తీయనున్నారు. మరుసటి రోజు అంటే 16వ తేదీ నుంచి ఆరోగ్య సిబ్బంది కూడా వెళ్తారు. ఆయా కుటుంబాల్లోని రోగులను పరిశీలించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. రోగులకు చికిత్స అవసరమైతే వెంటనే ఆస్పత్రులకు రిఫర్ చేస్తారు.

మండలాల్లో మెగా వైద్య శిబిరాలు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30న మండలాల వారీగా మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తారు. ప్రతి శిబిరంలో ఇద్దరు డాక్టర్లు ఉంటారు. వీరితో పాటు 104లో ఉండే డాక్టరు అందుబాటులో ఉంటారు. ఒక మండలంలో ఎన్ని విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయో ఆ పరిధిలో గుర్తించిన రోగులందరికీ ఆ రోజు వైద్య శిబిరంలో చికిత్సలు అందించే విధంగా చర్యలు చేపట్టనున్నారు. హెల్త్ శిబిరాల నిర్వహణలో ఎంపీడీఓ, తహసీల్దార్లు మొదలు అన్ని శాఖల అధికారులు పాలుపంచుకోవాల్సి ఉంటుంది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రెండు అంశాలు కీలకం కానున్నాయి. ఇంటింటికీ వెళ్లి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు జబ్బులను గుర్తించడం ఒక అంశమైతే.. వారికి చికిత్స చేయించేందుకు రిఫరల్ కోసం ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం రెండో అంశం.

దీర్ఘకాలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి

మధుమేహం, కేన్సర్, గుండె సంబంధిత సమస్యలు, కిడ్నీ సమస్యలు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులపై ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



వ్యాధిగ్రస్తులను గుర్తించి మెరుగైన వైద్యం అందించడమే 'జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. ఈ నెల 15 నుంచి ఇంటింటికీ వెళ్లి వలంటీర్, ఏఎన్‌ఎం సర్వే నిర్వహిస్తారు. 30వ తేదీ నుంచి ప్రతి మండలంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో హెల్త్ క్యాంపు ఉంటుంది. ప్రతి క్యాంపులో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లతో పాటు ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు సేవలందిస్తారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– డా.బి.జగన్నాథరావు, డీఎంహెచ్‌ఓ

క్లుప్తంగా

శివగౌరీప్రసాద్‌కు పీహెచ్‌డీ



ఏయూ స్నాతకోత్సవంలో పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న సువ్వారి శివగౌరీప్రసాద్

రాజాం: పట్టణంలోని జీఎంఆర్ ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సువ్వారి శివగౌరీప్రసాద్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఏన్ ఎక్స్‌పెరిమెంటల్ స్టడీ ఆన్ ద పెర్ఫార్మెన్స్ ఆఫ్ ఎక్సెస్డ్ అండ్ లేటరల్ రైన్‌ఫోర్స్‌డ్ సిలిక-మాంగనీస్ స్లాగ్ స్టోన్ కాలమ్స్ ఇన్ సాఫ్ట్ మెరైన్ క్లే విభాగంలో ఆయన పీహెచ్‌డీ పూర్తిచేశారు. ప్రొఫెసర్ పీవీవీ సత్యనారాయణ గైడెన్స్‌లో ఈ పరిశోధన పూర్తైందని శివగౌరీప్రసాద్ వెల్లడించారు. ఆయన స్వగ్రామం ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట. ఏయూ స్నాతకోత్సవంలో ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకున్న ఆయన ప్రతిభ పట్ల జీఎంఆర్ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్‌తో పాటు ప్రొఫెసర్లు, ఫరీదుపేట గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

సంతకవిటి: మండలంలోని హొంజరాం గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై బి.లోకేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈనెల 7 న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగిరాలేదని ఫిర్యాదులో తండ్రి పేర్కొన్నట్లు చెప్పారు. బంధువుల ఇంటి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో చేసిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

భోగాపురం: మండలంలోని కవులవాడ గ్రామానికి చెందిన ఉప్పిలి లక్ష్మణరావు(35) విద్యుత్ తీగ తగిలి తూడెం గ్రామంలో ఆదివారం మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కవులవాడకు గ్రామానికి చెందిన లక్ష్మణరావు సప్లయర్స్ సామగ్రి అద్దెకు ఇస్తూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తూడెం గ్రామానికి చెందిన దువ్వ రమణ కూమార్తె పెండ్లి సందర్భంగా ఈనెల 7వ తేదీన దువ్వ టెంట్లు వేశాడు. వివాహ అనంతరం తిరిగి టెంట్లు తీస్తున్న క్రమంలో విద్యుత్ తీగ తగిలి షాక్‌కొట్టి మృతిచెందాడు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కూమారులు ఉన్నారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతుని భార్య గౌరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



సీజ్ చేసిన బియ్యంతో విజిలెన్స్ అధికారులు

విజయనగరం క్రైమ్: అక్రమంగా వ్యాన్‌లో తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజయనగరంలోని డాబాతోట సమీపంలో విజిలెన్స్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. అధికారుల తనిఖీల్లో రూ.లక్షా 76వేల 244 విలువైన 4,638 కిలోల బియ్యం పట్టుబడ్డాయి. పట్టణానికి చుట్టుపక్కల గ్రామాల్లో గల లబ్ధిదారుల నుంచి సేకరించిన బియ్యాన్ని లైన్ వర్తకుల దగ్గర స్థానిక వ్యాపారి అప్పలరాజు కొనుగోలు చేసి వ్యాన్ ద్వారా ఒడిశా రాష్ట్రంలోని సొండి రమణ, శోభ గౌడలకు అక్రమంగా రవాణా చేస్తుంటాడు. ఈ సమాచారం అందుకున్న శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా..అమలు అధికారి సురేష్‌బాబు ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు పీడీఎస్ బియ్యం పట్టుకుని సీఎస్‌డీటీకి అప్పగించి నిందితుడిపై కేసు నమోదు చేయాలని సూ చించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బి.సింహాచలం, కానిస్టేబుల్ జి.పురుషోత్తం, పౌరసరఫరాల శాఖ అధికారులు బీవీవీ.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹158	₹286	₹ 296



సాగులో ఉన్న వరి



ఈ క్రాప్ నమోదు చేస్తున్న సిబ్బంది

వర్షాతిరేకం

- మూడురోజులుగా విస్తారంగా వానలు
- తుదిదశకు చేరుకున్న ఖరీఫ్ సాగు

పాలకొండ: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు సాగులో ఉన్న పంటలకు ప్రాణం పోస్తున్నాయి. దీంతో రైతులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో వరి సాధారణ విస్తీర్ణం 2,72,880 ఎకరాలు కాగా ఇప్పటికే 90శాతం మేరకు రైతులు ఉభాలు పూర్తి చేశారు. ప్రధానంగా పాలకొండ, పార్వతీపురం, వీరఘట్టం, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సాలూరు జియ్యమ్మవలస తదితర మండలాల్లో వరిసాగు ఈ ఏడాది విస్తారంగా చేస్తున్నారు.

సమృద్ధిగా వర్షాలు

వారం రోజులుగా జిల్లా అంతటా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో ఖరీఫ్ పంటలతో పాటు గిరిజన ప్రాంతాల్లో సాగులో ఉన్న పత్తి, మిరప పంటలకు అనుకూల వాతావరణం నెలకొందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కౌలు రౌతులకు ప్రభుత్వం సీసీఆర్ కార్డులు జారీ చేసి ఆర్థిక సహాయం అందించడంతో ఈ ఏడాది వ్యవసాయం పండగ వాతావరణంలో సాగుతోంది.

ముమ్మరంగా ఈ క్రాప్ నమోదు

జిల్లాలో రైతుల కోసం ఏర్పాటు చేసిన 306 రైతుభరోసా కేంద్రాల ద్వారా పంటల నమోదు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ముమ్మరంగా చేపడుతున్నారు. రైతులు సహకరించి ఈ క్రాప్ తప్పనిసరిగా చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఆగస్టు మొదటి వారం నుంచి చేపట్టిన ఈ క్రాప్ నమోదు ఇప్పటికే 70శాతం వరకు పూర్తయింది. ఇన్‌పుట్ సబ్సిడీ, ధాన్యం కొనుగోలు, క్రాప్ ఇన్సూరెన్స్, సున్నా వడ్డీ వంటి పథకాలు పొందడంలో ఈ క్రాప్ కీలకమని, రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

పంటలకు అనుకూలం

ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఖరీఫ్ సాగుకు అనుకూలంగా ఉంది. శతశాతం సాగుకు అంచనా వేస్తున్నాం. ఇప్పటికే రైతులకు అవసరమయ్యే ఎరువులు పూర్తిస్థాయిలో అందించాం. ప్రస్తుతం ఈ క్రాప్ నమోదు ముమ్మరంగా జరుగుతోంది. ఈ నెల 15వ తేదీ నాటికి పంటల నమోదు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– రాబర్ట్ పాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

విజయనగరంలో

ఆధునిక బస్టాప్

- ఎత్తుబ్రిడ్జిపై ప్రయాణికులకు ప్రత్యేక వసతులు
- తాగునీరు, మరుగు, ఏటీఎం సదుపాయం
- ప్రైవేటు సంస్థతో కార్పొరేషన్ ఒప్పందం



రాజీవ్ గాంధీ సర్కిల్ వద్ద ఏర్పాటు చేయనున్న ఆధునాతన బస్టాప్ నమూనా

విజయనగరం: అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న విజయనగరం కార్పొరేషన్ పరిధిలో రాజీవ్‌గాంధీ సర్కిల్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ సిద్ధమైంది. విశాఖ-రాయపూర్, విశాఖ - పాలకొండ మార్గాలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే సర్కిల్‌లో వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలకు సాగించే వారికి అవసరమైన సదుపాయాలు కల్పించే దిశగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ చర్యలు చేపడుతోంది. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆలోచనలతో సర్కిల్ నుంచి విశాఖకు వెళ్లే మార్గంలో రూ.25 లక్షల వ్యయంతో ప్రయాణికుల సౌకర్యార్థం అధునాతన బస్టాప్‌తో పాటు ఫుట్‌పాత్, సమీపంలో గార్డెన్ ఏర్పాటు చేయనున్నారు.

రూ.15 లక్షల వ్యయం

30 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పు విస్తీర్ణంలో ఓ ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన బస్టాప్‌లో ప్రయాణికులు సేదదీరేందుకు ఫ్యాన్‌లు, మినరల్‌వాటర్ సమకూర్చనున్నారు. పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా మరుగు సదుపాయం, ప్రయాణికుల సౌకర్యార్థం ఏటీఎం సౌకర్యం కల్పించనున్నారు. సదరు ప్రైవేటు సంస్థకు వారి ప్రకటనలు ప్రదర్శించుకునేలా అవకాశం కల్పించేందుకు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకోసం రూ.15 లక్షల వరకు వ్యయం అవుతుందని కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు రూపొందించారు. త్వరలో టెండర్‌లు పిలిచి పనులు ప్రారంభించడంతో పాటు ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లమ్మవారి జాతర మహోత్సవంలోగా పనులు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నారు.

ఏయూ టాపర్ మానస



గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న గవిడి మానస, చిత్రంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జీఎంఆర్, వీసీ ప్రసాద్‌రెడ్డి

- నాలుగు బంగారు పతకాలు సహా18 అవార్డులు సొంతం
- గవర్నర్, విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా స్వీకరణ
- ప్రస్తుతం ఏయూలో పీహెచ్‌డీ చేస్తున్న విద్యార్థిని



టాపర్‌గా నిలిచిన గవిడి మానస

చీపురుపల్లి: సాధారణ కుటుంబంలో జన్మించి చదువుల తల్లిగా ఎదిగింది. టాపర్‌గా నిలవడానికి కావాల్సింది బ్యాక్‌గ్రౌండ్ కాదని, కేవలం కష్టపడి చదవడమేనని రుజువు చేసింది. టాపర్‌గా నిలవడానికి అహర్నిశలు కృషి చేసి ఆంధ్రాయూనివర్సిటీ స్థాయిలో టాపర్‌గా నిలిచి నేటి యువతీ, యువకులకు ఆదర్శంగా నిలిచింది చీపురుపల్లి పట్టణానికి చెందిన గవిడి మానస. 2020-21 విద్యాసంవత్సరంలో మానస ఆంధ్రాయూనివర్సిటీలో ఎంఎస్సీ ఫిజిక్స్ పూర్తి చేసి టాపర్‌గా నిలిచింది. అయితే ఆ విద్యా సంవత్సరానికి మానస యూనివర్సిటీ స్థాయిలో టాపర్‌గా నిలవడంతో ఆమెను 18 అవార్డులు వరించాయి. వాటిలో 4 బంగారు పతకాలు ఉన్నాయి. యూనివర్సిటీల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు వివిధ సంస్థలు పతకాలు, ప్రశంసలు ఇస్తుంటాయి. అందులో భాగంగానే మానసకు 18 అవార్డులు లభించాయి. అయితే గత మూడేళ్లుగా ఆంధ్రాయూనివర్సిటీలో స్నాతకోత్సవాలు జరగకపోవడంతో వరుసగా మూడు స్నాతకోత్సవాలును శనివారం నిర్వహించారు. ఈ స్నాతకోత్సవానికి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జీఎంఆర్ సంస్థల అధినేత గ్రంధి మల్లికార్జునరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా మానస మెరిట్ ధ్రువీకరణతో బాటు పతకాలు అందుకుంది. ప్రస్తుతం ఆంధ్రాయూనివర్సిటీలోనే భౌతికశాస్త్రంపై మానస పీహెచ్‌డీ చేస్తోంది. ఇదిలా ఉండగా మానస తండ్రి శాంతారావు ఇందిరక్రాంతి పథం(వెలుగు)లో సీసీగా విధులు నిర్వహిస్తుండగా తల్లి పైడిరాజు వీఓఏగా పని చేస్తోంది. మానస ఒకేసారి 18 అవార్డులు తెచ్చుకోవడం, యూనివర్సిటీ టాపర్‌గా నిలవడంతో స్థానికంగా హర్షాతిరేకాలు వెల్లువెత్తాయి.

విద్యార్థులకు ఆరోగ్య భద్రత

- ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తయిన హెల్త్ డ్రైవ్
- ఆరోగ్య వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు



స్కూల్ హెల్త్ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

పార్వతీపురం టౌన్: విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తాజాగా వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు విద్యార్థులను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో ప్రతి పాఠశాలకు వైద్య సిబ్బందిని పంపించి విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన పాఠశాలల హెల్త్‌యాప్‌లో నమోదు చేయిస్తోంది.

ఏఎన్ఎంల ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలు

వ్యాధులతో బాధపడే వారికి ఉచిత వైద్యసేవలతో ఆరోగ్య భద్రత కల్పించింది. ఈ కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలో 360 మంది ఏఎన్ఎంలు పాఠశాలల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. 1699 పాఠశాలల్లోని 97,158 మంది విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను పరీక్షిస్తున్నారు. ఆయా వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. రెండు నెలల పాటు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో హెల్త్ డ్రైవ్‌ను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు.

పిల్లల ఆరోగ్యమే లక్ష్యంగా..

జిల్లాలో ప్రభుత్వ బడుల్లో చదువుతున్న 97,128 మంది విద్యార్థుల్లో 40 శాతం మంది గిరిజన గ్రామాలకు చెందిన వారు. వారిలో సికిల్‌సెల్, ఎనీమియా, రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఏఎన్ఎంలు పరీక్షలు నిర్వహిస్తున్నారు. వ్యాధుల గుర్తింపు, వైద్య పరీక్షలపై ఏఎన్ఎంలకు జిల్లా వైద్యాధికారులు శిక్షణ ఇచ్చారు. విద్యార్థుల ఎత్తు, బరువు వంటి వివరాలు సేకరించడంతో పాటు రక్తహీనతను గుర్తించేందుకు హిమోగ్లోబిన్ పరీక్ష నిర్వహిస్తున్నారు. సికిల్‌సెల్ ఎనీమియా సమస్యలున్న విద్యార్థులను గుర్తించి నివారణకు ఇప్పటికే కొందరు విద్యార్థులకు ఐరన్‌ఫోలిక్ మాత్రలను వైద్య శాఖ సరఫరా చేస్తోంది. ప్రస్తుత వైద్య పరీక్షల్లో ఆరోగ్య సమస్యలున్నట్లు గుర్తించిన విద్యార్థులకు పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందిస్తున్నారు. చిన్న వయసులోనే పూర్తి స్థాయిలో వ్యాధుల కట్టడికి వైద్యాధికారులు పూర్తి చర్యలు చేపట్టారు.

పాఠశాలల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థుల ఆరోగ్య వివరాలతో పాటు పాఠశాలల పరిశుభ్రత, మధ్యాహ్న భోజనం అమలు తీరు, తాగునీటి వసతులు తదితర వివరాలను హెల్త్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ప్రభుత్వం కౌమార బాలికల పరిశుభ్రతలో భాగంగా నేప్‌కిన్లను పంపిణీ చేస్తోంది. వీటి సరఫరాపై కూడా దృష్టి సారించాం.

– ఎస్.ప్రేమ్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం

ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకే..



విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పాఠశాలల్లోనే పరీక్షించి, వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. చిన్న వయసులోనే ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. ప్రతి విద్యార్థి ఆరోగ్య వివరాలను యాప్‌లో నమోదు చేస్తాం. ఆరోగ్యకర చదువులకు ఇది దోహదపడుతుంది. రక్తహీనతతో బాధపడుతున్న పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తున్నాం.

– డాక్టర్ వినోద్, స్కూల్ హెల్త్ నోడల్ అధికారి, పార్వతీపురం మన్యం

'ఏఎన్ఎంల ఆధ్వర్యంలో...



పీహెచ్‌సీల పరిధిలో పనిచేసే ఏఎన్ఎంలు విద్యార్థులకు వివిధ పరీక్షలు చేసి వారి ఆరోగ్య వివరాలను హెల్త్ యాప్‌లో నిక్షిప్తం చేశారు. దీనివల్ల విద్యార్థి ఆరోగ్య పరిస్థితి వైద్యులకు తెలుస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్ సిబ్బంది, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ విభాగాలను సందేశాల రూపంలో ఆ యాప్ అప్రమత్తం చేస్తుంది. వైద్య సిబ్బంది విద్యార్థుల ఆరోగ్య సమస్యల నివారణపై చర్యలు తీసుకుంటున్నారు.

– డాక్టర్ బి.జగన్నాథరావు, డీఎంహెచ్‌ఓ పార్వతీపురం మన్యం

అత్యవసర వేళ.. రక్షణ దిశగా..!

- సత్వరమే పోలీసుల సాయం
- పెరుగుతున్న మహిళల ఆదరణ
- ఇప్పటికే పెద్దసంఖ్యలో దిశ యాప్ రిజిస్ట్రేషన్లు

జిల్లాలో దిశ యాప్ వివరాలు

దిశ యాప్ రిజిస్ట్రేషన్‌లు	1,12,232
దిశకు వచ్చిన కాల్స్	3490
కౌన్సెలింగ్‌లు	67
ఎఫ్ఐఆర్‌లు	10



పార్వతీపురంలోని ప్రైవేట్ కళాశాలలో దిశయాప్‌ను డౌన్‌లోడ్ చేయించిన సిబ్బంది



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



పట్టణంలో దిశయాప్ డౌన్‌లోడ్ చేయిస్తున్న సిబ్బంది

పార్వతీపురంటౌన్: ఆపదలో చిక్కుకున్న మహిళలు సాయం కోరిన వెంటనే అక్కడికి పోలీసులు చేరుకుని రక్షణ కల్పించే వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించింది. అదే 'దిశ' మొబైల్ యాప్. మహిళల రక్షణ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దిశ యాప్‌ను అమలులోకి తీసుకువచ్చారు. ఈ యాప్‌పై పార్వతీపురం మన్యం జిల్లా పోలీసు యంత్రాంగం మహిళలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. యాప్‌ను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా పోలీసులు, మహిళా పోలీసులు అపార్ట్‌మెంట్లు, షాపింగ్ మాల్స్, విద్యాసంస్థలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లు, వాణిజ్య సముదాయాలు, సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాల వద్ద యాప్ పనితీరు? ఆపద సమయంలో ఎలా వినియోగించుకోవాలనే అంశాలపై అవగాహన నిర్వహిస్తున్నారు. విద్యార్థినులు, యువతులు, మహిళల్లో చైతన్యం తీసుకువచ్చి వారి సెల్‌ఫోన్లలో యాప్ రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఇప్పటివరకు 1,12,232 మంది దిశ యాప్‌ను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. జిల్లాలో ఈ యాప్‌ను వినియోగించుకుని ఇప్పటికే పెద్దసంఖ్యలో మహిళలు, యువతులు రక్షణ పొందారు. ఈ యాప్ దేశంలోని అన్ని పోలీసు ఎమర్జెన్సీ సర్వీసుల్లో బెస్ట్ అండ్ ఫాస్టెస్ట్ సర్వీసుగా నిలిచింది.

తక్షణ చర్యలు

కొంతమంది తెలియని వ్యక్తులు తన వెంటపడి దాడిచేశారని ఈ ఏడాది జూన్ 16 తేదీన పార్వతీపురం పట్టణానికి చెందిన ఓ మహిళ దిశ ఎస్ఓఎస్‌కు కాల్ చేసింది. తక్షణమే స్పందించిన కంట్రోల్ రూం సిబ్బంది పట్టణ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఆమెను రక్షించి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై పార్వతీపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

వేధిస్తే తాటతీస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తులు ప్రతిరోజూ వేధిస్తున్నారని గతేడాది నవంబర్ 26వ తేదీన రాత్రి పార్వతీపురం మండలంలోని చొక్కాపువానివలసకు చెందిన ఓ మహిళ దిశ ఎస్ఓఎస్‌కు కాల్ చేసింది. తక్షణమే పార్వతీపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు ఎస్ఓఎస్ సిబ్బంది సమాచారం అందించారు. రూరల్ పోలీసు సిబ్బంది రంగంలోకి దిగి నిందితులను అదుపులోకి తీసుకుని ఆమెను వేధింపులకు బలికాకుండా చేశారు. ఈ ఘటనపై రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

యాప్ పనితీరు ఇలా..

- దిశ ఎస్ఓఎస్ యాప్‌ను స్మార్ట్‌ఫోన్లలో ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఇన్‌స్టాల్ సమయంలో మాత్రమే నెట్ అవసరం. తర్వాత నెట్ లేకపోయినప్పటికీ యాప్ పనిచేస్తుంది.
- వ్యక్తిగత వివరాలతో పాటు కుటుంబసభ్యులు, స్నేహితులకు సంబంధించిన ఐదు ఫోన్‌నంబర్లను అందులో సేవ్ చేసుకోవాలి. ఆపదలో ఉన్నప్పుడు యాప్‌ను ఓపెన్‌చేసి అత్యవసర సహాయం(ఎస్ఓఎస్) బటన్ నొక్కాలి. బటన్ నొక్కే పరిస్థితి లేకపోతే ఫోన్‌ను వేగంగా అటూ ఇటూ ఊపితే ఫోన్ లొకేషన్ వివరాలు కంట్రోల్ రూమ్‌కు వెళ్తాయి. అదే క్రమంలో ఎస్ఓఎస్ బటన్ నొక్కి బాధితుల వాయిస్‌తో పాటు అక్కడ జరిగే దృశ్యాలను పదిసెకన్ల నిడివి వరకు వీడియో తీసి పంపవచ్చు. దీంతో నిమిషాల వ్యవధిలోనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని చర్యలు చేపడతారు.
- యాప్‌లో ట్రాక్‌మై ట్రావెల్ ఆప్షన్ వినియోగిస్తే మీరు ప్రయాణిస్తున్న వాహనం గమ్యానికి కాకుండా వేరే వైపు వెళ్తుంటే ఆ సమాచారం దిశ కంట్రోల్ రూమ్‌పాటు ఫోన్‌లో నమోదైన ఐదు నంబర్లకు పంపి అప్రమత్తం చేస్తుంది.
- దగ్గరల్లోని మెటర్నిటీ, ట్రామా కేర్ సెంటర్లు, ఇతర ఆస్పత్రులు, బ్లడ్ బ్యాంకులు, ఫార్మసీల వివరాలు దిశ ద్వారా తెలుసుకోవచ్చు.
- బాధితులు ఉన్న ప్రదేశానికి సమీప పోలీసుస్టేషన్, సురక్షిత ప్రాంతానికి వెళ్లేందుకు నావిగేషన్, పోలీసు డైరెక్టరీ, అత్యవసర సమయాల్లో ఫోన్ చేయాల్సిన నంబర్లు, సామాజిక మాధ్యమాలు, రోడ్డుభద్రత వంటి ఆప్షన్లు యాప్‌లో ఉంటాయి.

దిశ యాప్‌ను విధిగా డౌన్‌లోడ్ చేసుకోవాలి



ప్రతి మహిళ తన స్మార్ట్ ఫోన్‌లో దిశ యాప్‌ను విధిగా డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆపదసమయంలో యాప్ ఆపన్న హస్తంలా పనిచేస్తుంది. ఆపదలో ఎస్ఓఎస్ బటన్ నొక్కినా, ఫోన్‌ను అటూ ఇటూ ఊపినా నిమిషాల వ్యవధిలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రక్షిస్తారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా ఎంతోమంది గృహిణులు, ఉద్యోగినులు, యువతులు యాప్ ద్వారా గృహహింస, అసభ్య దూషణలు, బ్లాక్‌మెయిల్. లైంగిక వేధింపులపై ఫిర్యాదులు చేసి రక్షణ పొందారు.

– ఎస్ ఆర్. హర్షిత, దిశ డీఎస్పీ, పార్వతీపురం మన్యం జిల్లా.